సాక్షి కామారెడ్డి

శుక్రవారం । 8 । సెప్టెంబర్ । 2023



గెలుపు కోసం కృషి చేయాలి

రాబోయే ఎన్నికల్లో బీజేపీ గెలుపు కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని బెల్‌గావ్ దక్షిణ ఎమ్మెల్యే అభయ్ కుమార్ పాటిల్ కోరారు.

- 9లో ▸



అధిక వర్షాలతో అవస్థలు

నాలుగు రోజులుగా జిల్లాలో కురుస్తున్న అధిక వర్షాల కారణంగా పత్తి, మొక్కజొన్న సోయా పంటల్లో నీళ్లు నిలిచాయి.

- 10లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
29.1 /23.0

ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చల్లటిగాలులు వీస్తాయి. మధ్యాహ్నం చిరుజల్లులు కురియవచ్చు. సాయంత్రం మోస్తరు వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

మంజీర వాగులో కూలిన వైకుంఠధామం

ఎంపీ బీబీ పాటిల్ స్వగ్రామంలో..



మద్నూర్(జుక్కల్) : జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ స్వగ్రామమైన డోంగ్లీ మండలంలోని సిర్‌పూర్‌లో నిర్మించిన వైకుంఠధామం గురువారం మంజీర వాగులో కూలిపోయింది. నాలుగేళ్ల క్రితం సిర్‌పూర్ గ్రామానికి అనుకోని ఉన్న మంజీర వాగుకు అతి సమీపంలో వైకుంఠధామం నిర్మించారు. నాలుగు రోజులుగా భారీ వర్షాలు కురియడంతో వాగులో ఎగువ ప్రాంతం నుంచి భారీస్థాయిలో వరద నీరు వస్తోంది. దీంతో వరదనీటి తాకిడికి వైకుంఠధామం అడుగుభాగంలో కోతకు గురై నీటిలో కూలిపోయింది. 2021 వర్షాకాలంలో సగ భాగం వైకుంఠధామం కూలగా ప్రస్తుతం పూర్తిగా కూలిపోయిందని గ్రామస్తులు పేర్కొన్నారు.

ఎస్పీకి దళితుల ఫిర్యాదు



కామారెడ్డి టౌన్ : తాడ్వాయి మండల చిట్యాల గ్రామానికి చెందిన కొందరు దళితులు గురువారం జిల్లా ఎస్పీకి కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం దళితులకు 60, బీసీలకు 60 చొప్పున ఇళ్ల స్థలాలను కేటాయించిందన్నారు. అక్కడి స్థలంలో ముందు వరుసలో ఉంటామని కొందరు గొడవకు దిగగా 23 ఏళ్లుగా సమస్య పెండింగ్‌లో ఉందన్నారు. ఇప్పుడు ఆ స్థలంలో తాము హద్దులను పాతుకుంటే కొందరు నాయకులు వాటిని తొలగించి దౌర్జన్యానికి పాల్పడుతున్నారని తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిట్యాల గ్రామానికి చెందిన దళితులు పాల్గొన్నారు.

కృష్ణాష్టమి వేడుకల్లో ఎస్ఎస్ఏ ఉద్యోగుల నిరసన



కామారెడ్డి టౌన్ : సీఎం కేసీఆర్ తమ మొరను ఆలకించి న్యాయం చేయాలని సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగులు కృష్ణాష్టమి వేడుకల్లో కృష్ణుడి వేషంలో నిరసన తెలిపారు. తమను విద్యాశాఖలో విలీనం చేసి, రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ చేపడుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మె గురువారంతో 11వ రోజుకు చేరుకుంది. మున్సిపల్ కార్యాలయం ఎదుట చేపడుతున్న సమ్మె శిబిరంలో కృష్ణాష్టమి వేడుకలతో వినూత్నంగా నిరసన తెలిపారు. శ్రీకృష్ణ వేషధారణలో సమగ్ర శిక్ష ఉద్యోగి ఉట్టి కొట్టారు. సీఎం కేసీఆర్‌ను శ్రీకృష్ణుడిగా అభివర్ణిస్తూ ఫ్లెక్సీను ఏర్పాటు చేసి తమ మొర ఆలకించాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 25వేల మంది ఉద్యోగులు విద్యాశాఖలో కీలకంగా పని చేస్తూ నాణ్యమైన విద్య కోసం క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నామన్నారు. ఉద్యోగులు పిల్లలు సైతం గోపిక, శ్రీకృష్ణుని వేషధారణలో ప్లకార్డులు పట్టుకుని తమ తల్లిదండ్రులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సత్యానంద్, జిల్లా అధ్యక్షులు రాజవర్ధన్, జిల్లా జేఏసీ అధ్యక్షులు దామోదర్, ఎస్ఎస్ఏ ఉద్యోగులు తదితరులున్నారు.


కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూమి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): చిట్యాల శివారులో ఉన్న ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతోందని గ్రామస్తులు తెలిపారు. గ్రామ శివారులోని 151,156 సర్వే నంబర్లలో ఉన్న ప్రభుత్వ భూమిని గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు తమకు ఇష్టం వచ్చినట్లు ఆక్రమించుకుంటున్నారని ఆరోపించారు. అధికారులు వెంటనే స్పందించి కబ్జా చేసుకున్న వారి నుంచి భూమిని తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయమై గురువారం తాడ్వాయి తహసీల్దార్, ఎంపీడీవో, ఎస్సై, కామారెడ్డి ఆర్డీవో, జేసీ, జిల్లా పంచాయతీ కార్యాలయాలలో ఫిర్యాదు చేశారు.

పట్టాలెక్కనున్న కొత్త రైల్వేలైన్!

- ఆదిలాబాద్–పటాన్‌చెరు మార్గానికి అడుగులు
- 317 కి.మీ. లైన్‌కు రూ. 5,706 కోట్లతో అంచనా
- ఉమ్మడి జిల్లాకు ఎంతో ప్రయోజనం



ఉమ్మడి జిల్లా మీదుగా కొత్త రైల్వేలైన్ పట్టాలెక్కనుంది. కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ రైల్వేలైన్‌కు ఫైనల్ లొకేషన్ సర్వే కోసం పచ్చజెండా ఊపింది. – సాక్షి, కామారెడ్డి

ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి సమీపంలోని నాగలపల్లి నుంచి నిర్మల్, బాల్కొండ, ఆర్మూర్, బోధన్, రుద్రూర్, నస్రుల్లాబాద్, బాన్సువాడ, నిజాంసాగర్, అల్లాదుర్గ్, సంగారెడ్డి, మీదుగా పటాన్‌చెరుకు 317 కిలోమీటర్ల రైల్వే లైన్‌కు రూ. 5,706 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేసింది. దీంతో రైలు కూత తెలియని కామారెడ్డి జిల్లాలోని బాన్సువాడ, జుక్కల్ నియోజక వర్గాల ప్రజలకు రైలు సౌకర్యం అందుబాటులోకి రానుంది. ఆయా ప్రాంతాల ప్రజలు దూర ప్రాంత ప్రయాణాల కోసం రైలు ఎక్కాలంటే నిజామాబాద్, కామారెడ్డి పట్టణాలకు వెళ్లాల్సి వచ్చేది. కొత్త రైల్వే మార్గం అయిన తరువాత అక్కడి నుంచే ఎక్కడికైనా వెళ్లే అవకాశం రానుంది. కాగా బోధన్‌కు రైల్వేలైన్ ఉన్నప్పటికీ ఒక్క రైలు మాత్రమే అందుబాటులో ఉంది. కొత్తగా రైల్వేలైన్ నిర్మించడం మూలంగా ఉమ్మడి జిల్లాలో ఆర్మూర్, బాల్కొండ, బోధన్, బాన్సువాడ, జుక్కల్ ప్రజలకు ఎంతో సౌకర్యం కలుగుతుంది. జుక్కల్, బాన్సువాడ ప్రాంతం నుంచి చాలా మంది బతుకుదెరువు కోసం హైదరాబాద్ నగరానికి వెళ్తుంటారు. రైల్వే సౌకర్యం ఏర్పడిన తర్వాత రాకపోకలకు ఎంతో ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. కామారెడ్డి జిల్లాలో ఇప్పటికే హైదరాబాద్ నుంచి నిజామాబాద్‌కు రైల్వే మార్గం ఉంది. ఇటీవలే రైల్వేలైన్ విద్యుద్దీకరణ కూడా జరిగింది.ఈ మధ్యే డబుల్ లైన్ కూడా మంజూరైంది. కామారెడ్డి రైల్వేస్టేషన్ మీదుగా 50కి పైగా రైళ్లు నడుస్తున్నాయి. అటు హైదరాబాద్ వైపు, ఇటు నిజామాబాద్ వైపు నిత్యం వందల సంఖ్యలో ప్రయాణాలు చేస్తున్నారు.

పంట ఉత్పత్తుల రవాణా సులువు

ఉమ్మడి జిల్లాలో పంట ఉత్పత్తుల రవాణాకు రైల్వేలైన్లతో ఎంతో మేలు జరుగుతుంది. ఇప్పటికే కామారెడ్డి, నిజామాబాద్ రైల్వే స్టేషన్ల ద్వారా పెద్దఎత్తున పంట ఉత్పత్తులు ఇతర ప్రాంతాలకు రవాణా అవుతున్నాయి. కొత్త రైల్వేమార్గం ఏర్పాటైతే అటు ఆర్మూర్, బాల్కొండ ప్రాంతాల్లో ఉత్పత్తి అయ్యే పసుపు, జొన్నలు, మక్కలను ఇతర ప్రాంతాలకు తరలించడానికి ఉపయోగపడుతుంది. అలాగే బాన్సువాడ, రుద్రూర్ ప్రాంతాల్లో పెద్దఎత్తున వరి సాగవుతున్నందున బియ్యాన్ని రవాణా చేయడానికి రైల్వేలైన్‌తో మేలు జరుగుతుంది. జుక్కల్ నియోజకవర్గంలో సాగయ్యే పప్పు దినుసులు, సోయా వంటిపంట ఉత్పత్తులు రవాణాకు ఉపయోగపడుతుంది.

చౌకగా.. సౌకర్యవంతంగా..

తిరుపతి, విశాఖ, విజయవాడ, రాజమండ్రి, వరంగల్, అన్నవరం, షిర్డీ, ముంబయి తదితర ప్రాంతాలకు రైళ్లు ఉండడంతో నిత్యం ఎంతోమంది రాకపోకలు సాగిస్తున్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రాలైన తిరుపతి, షిర్డీకి ప్రతినిత్యం రైళ్లు ఈ మార్గం గుండా నడుస్తుండడంతో చాలా మంది రైళ్లలో వెళ్లి వస్తున్నారు. రైళ్లో ప్రయాణం సురక్షితంగా, సౌకర్యంగా వెరసి తక్కువ చార్జీలతో వెళ్లి రావచ్చనే ఉద్దేశ్యంతో చాలామంది రైళ్లలోనే ప్రయాణం చేస్తుంటారు. 44వ నంబరు జాతీయ రహదారి (బెంగుళూరు–నాగ్‌పూర్), 161 వ నంబరు జాతీయ రహదారి (సంగారెడ్డి–నాందేడ్–అకోలా), కొత్తగా హైదరాబాద్ నుంచి మెదక్, ఎల్లారెడ్డి, బాన్సువాడ, బైంసా రూట్లో జాతీయ రహదారి కూడా మంజూరైంది. కరీంనగర్ నుంచి సిరిసిల్లా, కామారెడ్డి, ఎల్లారెడ్డి మీదుగా పిట్లం వరకు జాతీయ రహదారిగా గుర్తించారు. ఇటు రోడ్డు, అటు రైల్వేలైన్ కనెక్టివిటీ మూలంగా ప్రజలకు రాకపోకలకు ఎంతో సులువుగా ఉంటుంది.



శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు గురువారం కనుల పండువగా జరిగాయి. చిన్నారులు గోపికలు, గోపాలుల వేషధారణలతో ఆకట్టుకున్నారు. జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని శిశుమందిర్‌లో చిన్నారులు ఉట్టికొట్టారు. – కామారెడ్డి టౌన్

బీఆర్‌ఎస్‌తోనే కామారెడ్డి అభివృద్ధి

- ప్రతిపక్షనేతలు కళ్లుండి చూడలేని గుడ్డోళ్లు
- ఎస్సారెస్పీ నుంచి 47 కి.మీ. పైప్‌లైన్ కోసం రూ. 195 కోట్లు మంజూరు
- కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందాం
- ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్



వివరాలను వెల్లడిస్తున్న ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

కామారెడ్డి టౌన్ : ప్రతిపక్ష పార్టీ నాయకులు, కొందరు సీనియర్ నాయకులు కామారెడ్డి నియోజవర్గం అభివృద్ధి జరగలేదని పేర్కొంటూ.. కళ్లుండి గుడ్డివాళ్లలాగా ప్రవర్తిస్తున్నారని, రాజకీయ లబ్ధికోసం చిత్తశుద్ధి లేకుండా మాట్లాడితే ఊరుకునేది లేదని ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్ మండిపడ్డారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం సమావేశంలో ఆయన మాట్లాడారు. కామారెడ్డి నియోజవర్గాన్ని ముమ్మాటికి 100 శాతం అభివృద్ధి చేసింది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనన్నారు. అవగాహన లేకుండా అసత్యంగా ప్రజల్ని మభ్యపెట్టేందుకు మాట్లాడడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గత కాంగ్రెస్ పార్టీ హయాంలో కామారెడ్డి నియోజకవర్గానికి ఎస్సారెస్పీ నుంచి నిర్మించిన మంచినీటి పైప్‌లైన్ నిర్మాణం నాసిరకంగా ఉండడం వల్ల చాలా బ్రేక్‌డౌన్ సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ఈ సమస్యతో కామారెడ్డి నియోజకవర్గంలో నెలలో 10 నుండి 12 రోజులు మంచి నీరు రాని పరిస్థితి తలెత్తిందన్నారు. ఈ విషయంపై సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లగానే 47 కి.మీ. పైప్ లైన్ నిర్మాణం కోసం జీవో నం. 460 ద్వారా రూ. 195 కోట్లు మంజూరు చేశారన్నారు. గత కాంగ్రెస్ పార్టీ హయాంలో అప్పటి నాయకులు ఎన్నికల ముందు నాసిరకం జీఆర్‌పీ పైప్ నిర్మాణం చేపట్టారన్నారు. 99 జీపీలకు నూతన భవనాలను అన్ని హంగులతో నిర్మించుకున్నామన్నారు. జిల్లా కేంద్రంలో రెండు లైన్ల రోడ్ల నుంచి విశాలంగా డివైడర్లతో నాలుగు లైన్ల రోడ్లను నిర్మించుకున్నామన్నారు. కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం, కళాభారతి అద్భుతంగా నిర్మించుకున్నామన్నారు. సీఎం కేసీఆర్‌ను కామారెడ్డిలో భారీ మెజార్టీలతో గెలిపించుకుంటామని, ప్రతిపక్షాలకు డిపాజిట్ ఓట్లు కూడా రావన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబొద్దీన్, ఎంపీపీ ఆంజనేయులు, నర్సింగ్‌రావు, గడ్డం చందు, బల్వంత్‌రావు, జూకంటి ప్రభాకర్‌రెడ్డి, తిర్మల్‌గౌడ్, ఆయా మండలాల నాయకులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

గజ్వేల్‌ను దోచుకుని కామారెడ్డికి వస్తుండు



రామేశ్వర్‌పల్లిలో నీట మునిగిన డబుల్‌బెడ్‌రూం ఇళ్ల వద్ద నిరసన తెలుపుతున్న మాజీ మంత్రి షబ్బీర్‌అలీ

- భూములు కొల్లగొట్టేందుకు కల్వకుంట్ల ఫ్యామిలీ కుట్ర
- విద్యావైద్యానికి అధిక ప్రాధాన్యతనిస్తా
- ఎప్పటికీ కామారెడ్డిలోనే ఉంటా
- మాజీ మంత్రి షబ్బీర్ అలీ

భిక్కనూరు : ఎంతోమంది ప్రాణత్యాగం చేసి తెచ్చుకున్న తెలంగాణను నిత్యం దోచుకుంటున్న సీఎం కేసీఆర్ గజ్వేల్‌ను దోచుకుని ఇప్పుడు కామారెడ్డికి వస్తున్నాడని మాజీ మంత్రి, కాంగ్రెస్ రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ షబ్బీర్ అలీ పేర్కొన్నారు. గురువారం ఆయన భిక్కనూరు మండలంలో రామేశ్వర్‌పల్లిలో చెరువు నీట మునిగిన డబుల్ బెడ్‌రూమ్‌లను ఆయన పరిశీలించారు. మోకాళ్ల లోతు నీటిలో నుంచి నడిచి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలోకి వెళ్లి పరిశీలించారు. కామారెడ్డిలో విలువైన సంపదను దోచు కునేందుకు కల్వకుంట్ల ఫ్యామిలీ పన్నాగం పన్నిందన్నారు. నాడు కామారెడ్డికి విద్యుత్‌తో నీటి సరఫరా చేసినందుకు అసెంబ్లీలో తనను పొగిడిన సీఎం ప్రస్తుతం తనపైనే పోటీకి వస్తున్నాడన్నారు. కామారెడ్డి ప్రజలే తన బలంబలగమని, కేసీఆర్‌ను తుక్కుతుక్కుగా ఓడిస్తానన్నారు. గజ్వేల్ ప్రజలను కామారెడ్డికి తీసుకొచ్చి అక్కడి దోపిడీని ఇక్కడి వారికి వివరిస్తానని, ఇక్కడి ప్రజలను గజ్వేల్‌కు తీసుకెళ్తానన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రూ. 500 గ్యాస్ సిలిండర్‌తో పాటు మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ అమలు చేస్తామన్నారు. కామారెడ్డిని ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతానని, 350 పడకలతో ఆస్పత్రి, సాగుభూములకు నీళ్లిస్తానన్నారు. కేసీఆర్ రూ. 1500 కోట్లతో ప్రగతిభవన్, రూ. 15 వేల కోట్లతో సచివాలయం కట్టి డబుల్‌బెడ్‌రూం ఇళ్లను మాత్రం నాణ్యతలేనివిగి నిర్మించారన్నారు. కేసీఆర్‌కే ఓటేస్తా మని చేసిన తీర్మానాలన్నీ బూటకమన్నారు. వీటిపై ఎలక్షన్ కమీషన్‌కు ఫిర్యాదు చేశామని, జీపీ కార్యదర్శులను వివరణ కోరతారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పేదలకు ఇళ్లు కట్టుకుంటే రూ. 5లక్షలు ఇస్తామన్నారు. ప్రాణహిత చేవెళ్ల ప్యాకేజీ పనులకు నిధులివ్వకుండా కేసీఆర్ చిన్నచూపు చూస్తున్నారన్నారు. నేను పుట్టింది ఈ ప్రాంతంలోనేనని జీవితాంతం ఈ ప్రాంతప్రజలకే సేవ చేస్తానన్నారు. కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంద్రకరణ్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, కిసాన్ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు కుంట లింగారెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ ఎడ్ల రాజిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బల్యాల సుదర్శన్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భీంరెడ్డి, మహిళ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు జ్ఞానేశ్వరి, రామేశ్వర్‌పల్లి గ్రామశాఖ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

మందకొడిగా ప్లాట్ల క్రమబద్ధీకరణ

- జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారుల నిరీక్షణ
- మూడు నెలలు గడిచినా ఆన్‌లైన్ చేయడంలో జాప్యం
- అధికారుల్లేక విచారణ ఆలస్యం



బాన్సువాడ మున్సిపాలిటీ కార్యాలయం

బాన్సువాడ : అనధికారిక లేఅవుట్లలో ప్లాట్ల క్రమబద్ధీకరణకు చేపట్టిన ప్రక్రియ మందగించింది. గతంలో రూ. 1,000 డీడీ చెల్లించిన వారికి మూడు నెలలు కిందట క్రమబద్ధీకరణకు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కామారెడ్డి జిల్లాకేంద్రంలో సుమారుగా 18,000కు పైగా బాన్సువాడ మున్సిపాలిటీలో 1,680 పైన, ఎల్లారెడ్డిలో 900పైగా దరఖాస్తులను పరిష్కరించడానికి ఇంకా కొన్ని నెలల సమయం పట్టే అవకాశముంది. ఆన్‌లైన్‌లో లాగిన్ లేక దరఖాస్తుల వివరాలు తెలియకపోవడం అధికారులకు సమస్యగా మారింది.

వివరాల్లేక ఇబ్బంది..

క్రమబద్ధీకరణ కోసం గతంలో దరఖాస్తు చేసుకున్న వారే జిరాక్స్ పత్రాలను బల్దియా కార్యాలయాల్లో సమర్పించారు. వీటి ఆధారంగా దరఖాస్తుదారులకు పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు ఫోన్లలో సంప్రదిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలన జరగడం లేదు. కేవలం కార్యాలయాలకు వచ్చిన వారి దరఖాస్తుల పరిశీలనకే పరిమితమవుతున్నారు. ఇప్పటివరకు సిటిజన్ లాగిన్ లేక దరఖాస్తుదారులకు కూడా ఎటువంటి సమాచారం తెలియడం లేదు. ధ్రువపత్రాలు కూడా అప్‌లోడ్ చేయలేని పరిస్థితి నెలకొంది. ఈనెల 16 రాత్రి నుంచే ఆన్‌లైన్ లాగిన్ ప్రారంభమైనట్లు సమాచారం. కాని పూర్తిస్థాయి అధికారి లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు.

మున్సిపాలిటీల్లో వచ్చిన దరఖాస్తులు	
కామారెడ్డి	18,000
ఎల్లారెడ్డి	900
బాన్సువాడ	1,680

పూర్తిస్థాయిలో అధికారుల్లేక..

వేలాది దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో విచారించడానికి సిబ్బంది సరిపడా లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రతి మున్సిపాలిటీలో తాత్కాలిక సిబ్బందిని నియమించుకోవాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చినా ఇప్పటివరకు కొలిక్కిరావడం లేదు. బాన్సువాడలో టౌన్‌ప్లానింగ్ అధికారి కార్యాలయంలో కేవలం రెండు రోజులు మాత్రమే ఉంటారు. భవన నిర్మాణాల అనుమతులు, వాటి పరిశీలనకు తీవ్ర జాప్యం జరుగుతుంది. దరఖాస్తుదారుడి ఫోన్‌లోనే జనరేషన్ చేసుకునే వీలుంది. ఫోన్‌పే ద్వారా డబ్బులు కూడా చెల్లించే అవకాశం ఉంది.

వారంలో 100 దరఖాస్తుల పరిశీలన

బాన్సువాడలో ఇప్పటివరకు 1,680 దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటివరకు సిటిజన్ లాగిన్ లేక ఇబ్బంది ఏర్పడింది. నిన్న రాత్రి నుంచి లాగిన్ ప్రారంభమైంది. టీపీవో రెండు రోజులు మాత్రమే రావడంతో దరఖాస్తులను పరిశీలించడంలో కొంత ఆలస్యం అవుతుంది. దరఖాస్తు చేసుకున్న వారి ఫోన్‌లోనే జనరేషన్ చేసుకుని వీలుంది. మున్సిపల్ శాఖ నిర్ణయం మేరకు చర్యలు తీసుకుంటాం.

– రమేశ్, కమిషనర్ బాన్సువాడ

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలి

- ఎస్పీ శ్రీనివాస రెడ్డి
- సరిహద్దు రాష్ట్ర పోలీస్ అధికారులతో సమన్వయ సమావేశం



అధికారులను సన్మానిస్తున్న ఎస్పీ తదితరులు

కామారెడ్డి క్రైం : రానున్న తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సరిహద్దు రాష్ట్రమైన కర్ణాటక లోని బీదర్, కామారెడ్డి, సంగారెడ్డి జిల్లాల పోలీస్ అధికారులతో సమన్వయ సమావేశాన్ని ఎస్పీ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో గురువారం జహీరాబాద్‌లో నిర్వహించారు. సరిహద్దుల నుంచి మద్యం, డబ్బు, ఇతర చట్ట వ్యతిరేక కార్యకలాపాలను నివారించడం, పాత నేరస్తుల బైండోవర్ లాంటి అంశాలపై చర్చించారు. సరిహద్దులోని పోలీస్ స్టేషన్లు, అధికారుల వివరాలు, రెవెన్యూ, ఎక్సైజ్, రవాణా, పన్నులు తదితర శాఖల సమాచారాన్ని సేకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని జుక్కల్, బిచ్కుంద పోలీస్ స్టేషన్లు కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాలతో సరిహద్దులను, సంబంధాలను కలిగి ఉన్నాయన్నారు. ఎన్నికలు పూర్తయ్యేంతవరకు ఆయా రాష్ట్రాల, జిల్లాల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. సమావేశంలో సంగారెడ్డి ఎస్పీ ఎం రమణ కుమార్, బీదర్ ఎస్పీ చెన్న బసవన్న, బాన్సువాడ డీఎస్పీ జగన్నాథ రెడ్డి, ఎస్బీ సీఐ చంద్రశేఖర్ రెడ్డి, బిచ్కుంద సీఐ ఆర్ కృష్ణ, ఆయా జిల్లాల డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు,అధికారులు పాల్గొన్నారు.

సరిహద్దు ప్రాంతాలపై నిఘా

నిజాంసాగర్(జుక్కల్) : కర్ణాటక, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాలపై పటిష్టమైన నిఘా ఉంచడంతో పాటు చెక్ పోస్టుల్లో వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు చేయాలని జిల్లా ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం డోన్‌గాం శివారులోని రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టును జిల్లా ఎస్పీ తనిఖీ చేశారు. మూడు రాష్ట్రాల సరిహద్దున మద్నూర్, జుక్కల్ మండలాల్లోని గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. దేశీదారు మద్యం, నాటుసారా, గంజాయి రవాణా, అనుమానిత వ్యక్తుల సంచారాన్ని నివారించాలన్నారు. బాన్సువాడ డీఎస్పీ జగన్నాథ రెడ్డి, సీఐలు కృష్ణ, మురళి ఎస్సైలు సత్యనారాయణ, విజయ్‌కొండ ఉన్నారు.

మెడికల్ కాలేజీకి ముహూర్తం ఖరారు!

- ఈనెల 15న వర్చువల్‌గా ప్రారంభించనున్న సీఎం కేసీఆర్



సాక్షి, కామారెడ్డి : కామారెడ్డిలో ఏర్పాటైన ప్రభుత్వ వైద్య కళాశాల ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారైంది. ఈనెల 15న సీఎం కేసీఆర్ వర్చువల్‌గా రాష్ట్రంలోని తొమ్మిది కళాశాలలను ప్రారంభించనున్నారు. అందులో భాగంగా కామారెడ్డి వైద్య కళాశాల కూడా ప్రారంభిస్తారు. ఇప్పటికే అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. త్వరలో తరగతులు ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో కళాశాలను ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్ రావు అధికారులతో పలుమార్లు సమీక్షించి ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. దీంతో కళాశాల పనులను వేగవంతం చేశారు.

ఎన్నో రోజులుగా కామారెడ్డిలో వైద్య కళాశాల ఏర్పాటు చేయాలని ఈ ప్రాంత విద్యావేత్తలు కోరుకున్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రచార సభలో కామారెడ్డికి మెడికల్ కాలేజీ వస్తుందని సీఎం కేసీఆర్ ప్రకటించారు. మొదటి విడతలో మంజూరు అవుతుందని భావించినా మంజూరు కాలేదు. ఎట్టకేలకు ఈ ఏడాది కాలేజీ ఏర్పాటు చేస్తామని ప్రకటించి ప్రక్రియ ప్రారంభించడంతో స్థానిక ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. మాతా శిశు ఆస్పత్రి కోసం నిర్మించిన భవనంలో కళాశాలను ఏర్పాటు చేస్తున్నారు. కాగా జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులకు కౌన్సెలింగ్ ద్వారా మెడికల్ సీట్లు లభించాయి. ఫ్యాకల్టీ నియామకం కూడా జరిగింది.

క్లుప్తంగా

ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం



పెద్దకొడప్‌గల్(జుక్కల్): ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని ఎస్పీ శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పోచారం తండాలో తండా వాసుల సహకారంతో రూ.లక్ష 55 వేలతో 14 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. గురువారం సీసీ కెమెరాల ప్రారంభోత్సవానికి జిల్లా ఎస్పీ శ్రీనివాస్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని, వీటితో నేరాలను కట్టడి చేయవచ్చని చెప్పారు. డీఎస్పీ జగన్నాథ్ రెడ్డి, సీఐ కృష్ణ, బాన్సువాడ సీఐ మురళి, ఎస్సై కోనారెడ్డి, పిట్లం ఎస్సై రంజిత్, సర్పంచ్ మదన్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి బేస్‌మెంట్‌ను కూల్చిన వ్యక్తిపై ఫిర్యాదు

మాచారెడ్డి: మండలంలోని గజ్యా నాయక్ తండాలో నిర్మాణంలో ఉన్న తన ఇంటి నిర్మాణ బేస్‌మెంట్‌ను కూల్చేసిన ఒకరిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు వాహబ్ పాష తెలిపాడు. తన సొంత స్థలంలో జీపీ అనుమతితో ఇంటి నిర్మాణం చేపట్టానని ఆ స్థలం ఘన్‌పూర్ ఉప సర్పంచ్ మల్లేశ్ తనదంటూ జేసీబీతో కూల్చి వేయించాడని ఆందోళన వ్యక్తం చేశాడు. మల్లేశ్‌పై చర్య తీసుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

14,15 తేదీల్లో అథ్లెటిక్స్‌లో ఎంపికలు

నిజామాబాద్‌నాగారం:జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 14, 15 తేదీల్లో జిల్లాస్థాయి ఎంపికలు నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నరాల రత్నాకర్, రాజాగౌడ్ గురువారం తెలిపారు. ఈ నెల 14న అండర్–14, 16, 18, 20 విభాగంలో బాలబాలికలకు, 15న అండర్–8, 10, 12 విభాగంలో ఎంపికలు ఉంటాయన్నారు. ఉదయం 10గంటలకు జిల్లా కేంద్రంలోని రాజారాం స్టేడియంలో పోటీలు ఉంటాయని అన్నారు. విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. రూ. 100 ఎంట్రీ ఫీజు ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 9989040776 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

మొరం టిప్పర్ల అడ్డగింత

కోటగిరి (రుద్రూర్): కోటగిరి మండలం రాంపూర్ శివారులో మొరం టిప్పర్లను డీసీసీ కార్యదర్శి, కోటగిరి ఎంపీటీసీ మనోహర్ గురువారం అడ్డుకున్నారు. సెలవు రోజుల్లో మొరం తరలించడం సరైంది కాదన్నారు. అనుమతి పత్రాలు లేకుండా మొరం తరలిస్తున్న టిప్పర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బెల్ట్‌షాపులను తొలగించాలి

ఖలీల్‌వాడి: నగరంలోని అశోక్ నగర్ కాలనీలో అంగన్‌వాడీ స్కూల్ వెనుక ఉన్న బెల్ట్ షాపును తొలగించాలని సీపీఐ, కాలనీవాసులు గురువారం డిమాండ్ చేశారు. బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న స్థలానికి మద్యాన్ని పోలీసులకు అప్పగించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సుధాకర్, సీపీఐ అర్బన్ నియోజకవర్గ కార్యదర్శి వై.ఓమయ్య, నాయకులు బి.రఘురాం, సఖి, సురేశ్, కండ్ల కోయల గంగాధర్, కాలనీవాసులు శ్రీనివాస్, ప్రభంజన్ కె.రాజు, కె.పోశెట్టి, సంజు, మహిళా సంఘం నాయకులు మంజుల, గంగమ్మ, పద్మ పాల్గొన్నారు.

గోమాతకు అంత్యక్రియలు

సుభాష్‌నగర్: నగరంలోని వినాయక్‌నగర్‌లో మృతిచెందిన గోమాతకు విశ్వహిందూ పరిషత్ జిల్లా సహ కార్యదర్శి దాత్రిక రమేశ్ ఆధ్వర్యంలో గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. గోసేవకులు వినయ్, శేఖర్ ఉన్నారు.

చేపల వేటతో మస్తు మజా..

- సరదా కోసమే గాలమేస్తామంటున్న స్థానికులు
- గాలానికి చిక్కుతున్న చేపలు



గాలానికి చిక్కిన చేపను తీస్తున్న యువకుడు



ఎస్సారెస్పీ పునరుజ్జీవన పథకం వద్ద గాలం వేస్తున్న యువకులు

బాల్కొండ: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఎస్సారెస్పీ చుట్టూ ఉన్న కాలువలు, ప్రాజెక్టు బ్యాక్‌వాటర్‌లోకి నీరు అధికంగా రావడంతో చేపలు పట్టేందుకు స్థానికులు ఆసక్తి చూపుతున్నారు. చేపలు పట్టేందుకు ఎక్కువగా వలను ఉపయోగిస్తారు.. కానీ కొందరు తమ సరదా కోసమే గాలం వేస్తూ చేపలను పడుతున్నట్లు పేర్కొంటున్నారు. దీంతో ప్రాజెక్టు పరిసర ప్రాంతాలు గాలం వేస్తున్న వారి సందడి ఎక్కువగా కనిపిస్తోంది. ప్రధానంగా వరద కాలువ, పునరుజ్జీవన పథకం హెడ్ రెగ్యులేటర్‌పై నిలబడి గాలమేస్తున్నారు.

గాలానికి గోధుమ పిండి ఎర..

గాలం వేసే వారు సన్నని కర్రకు దారం కట్టి దాని చివరన సూది లాంటి పరికరాన్ని అమర్చుతారు. చేపలు గాలానికి చిక్కాలంటే ఎర వేయాల్సిందే. గతంలో వానపాములను చేపలకు ఎర వేసేవారు.. కానీ ప్రస్తుతం అధికంగా గోధుమ పిండిని ఉండలు కట్టి ఎర వేస్తున్నారు. ఇలా పలుమార్లు ఎరవేస్తే గాలానికి చేపలు చిక్కుతున్నాయని దీంతో మేము వాటిని సంతోషంగా ఇంటికి తీసుకెళ్తున్నట్లు స్థానికులు తెలిపారు.

సరదా కోసమే



ప్రాజెక్ట్‌లోకి నీరు రావడంతో నిత్యం చేపల కోసం గాలం వేస్తున్నాను. గాలం వేయడం నాకు అలవాటుగా మారిపోయింది. పరిసర ప్రాంతాల్లో నీరు ఎక్కువగా కనిపిస్తే గాలానికి పిండి కట్టి ఎరవేస్తున్నాను. చిన్న చేపలు పడడంతో సంతోషంగా పట్టుకొని ఇంటికెళ్తాను. గాలం వేయడం సంతోషంగా అనిపిస్తుంది.

–గౌస్, బాల్కొండ

ఏకాగ్రత పెరుగుతుంది



గాలం వేయడంతో ఏకాగ్రత పెరుగుతుంది. అంతే కాకుండా మానసిక ఒత్తిడి సైతం దూరమవుతోంది. గాలం వేసినప్పుడు దృష్టి అంతా గాలం పైనే ఉంటుంది. అది నాకు ఒక అలవాటుగా మారిపోయింది. ప్రాజెక్టు ప్రాంతాల్లో ఇలా చేపలకు గాలం వేస్తూ పట్టుకుంటున్నాను. ఒక్కసారికే చిక్కవు. పలుమార్లు వేస్తే ఒక్కటి చిక్కుతోంది.

–ఏథీషామొద్దీన్, బాల్కొండ



క్యాసంపల్లి తండాలో తీజ్ ఉత్సవాల్లో పాల్గొన్న యువతులు

వైభవంగా తీజ్ ఉత్సవాలు

కామారెడ్డి టౌన్: క్యాసంపల్లి తండాలో గురువారం తీజ్ వేడుకలను నిర్వహించారు. 9 రోజుల పాటు ప్రత్యేక పూజలతో పెంచిన గోధుమ బుట్టలను యువతులు ఎత్తుకుని పండుగను ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో బంజారా నేతలు, గ్రామస్తులు పాల్గొన్నారు. అలాగే కామారెడ్డి డిగ్రీ కళాశాలలో ఎస్టీ విద్యార్థులు తీజ్ ఉత్సవాలను జరుపుకున్నారు.

చెట్లు నరికివేతపై ఫిర్యాదు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని అమ్రాబాద్ శివారులో ఉన్న అమ్రాబాద్ తండా, చంద్రునాయక్ తండాల్లో సుమారు ఐదెకరాల అటవీ భూమిలో చెట్లు నరికివేసినట్లు అటవీశాఖ అధికారి మానస గురువారం ఫిర్యాదు చేసినట్లు ఎస్సై ఎల్ రాము తెలిపారు. నిందితులను గుర్తించి చర్యలు తీసుకుంటామని ఎస్సై పేర్కొన్నారు.

తహసీల్దార్ ఎదుట ఏడుగురి బైండోవర్

మండలంలోని ముదక్‌పల్లిశివారులో ఉన్న గుడి తండాకు చెందిన ఏడుగురిని తహసీల్దార్ ఖాజా ఖుద్బుద్దీన్ ఎదుట గురువారం బైండోవర్ చేసినట్లు ఎస్సై ఎల్ రాము తెలిపారు. అటవీశాఖ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు.

73 మంది కండక్టర్లు, డ్రైవర్లకు ఏడీసీలుగా పదోన్నతి

ఖలీల్‌వాడి: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని ఆరు డిపోల్లోని 73 మంది కండక్టర్లు, డ్రైవర్లకు అసిస్టెంట్ డిపో క్లర్క్, ఆర్టీసీ కంట్రోలర్‌గా పదోన్నతులు కల్పించినట్లు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జానీరెడ్డి గురువారం తెలిపారు. సీనియారిటీ బట్టి పదోన్నతులు కల్పించినట్లు చెప్పారు. గతంలో కంటే ఈ సారి ఎక్కువ పదోన్నతులు కల్పించడంపై ఆర్టీసీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

ప్రశాంతంగా మిలాద్–ఉన్–నబీ నిర్వహించాలి

- సీపీ సత్యనారాయణ

ఖలీల్‌వాడి: రాబోయే మిలాద్–ఉన్–నబీని ప్రతి ఒక్కరూ ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని సీపీ సత్యనారాయణ తెలిపారు. గురువారం జిల్లా పోలీస్ కమాండ్ కంట్రోల్ హాల్‌లో సీపీ ముస్లిం మత పెద్దలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డీసీపీ ఎస్. జయ్‌రామ్, ఏసీపీలు కిరణ్ కుమార్, రవీందర్‌రెడ్డి, రాజశేఖర్ రాజు, స్పెషల్ బ్రాంచ్ సీఐ శ్రీశైలం,సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.



అలీసాగర్ నుంచి 350 క్యూసెక్కుల నీటి విడుదల



ఎడపల్లి(బోధన్): మండలంలోని అలీసాగర్ రిజర్వాయిర్ ఇటీవల కురిసిన వర్షానికి నిండుకుండలా మారింది. నిజాంసాగర్ ప్రధాన కెనాల్‌లోకి భారీ వరద చేరడంతో గురువారం అలీసాగర్ ఒక గేటు ఎత్తి 350 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

ఘనంగా వివాహ వేడుక



కామారెడ్డి టౌన్ : కామారెడ్డి జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రేమ్ కుమార్ కూతురు ప్రియాంక వివాహం నిజామాబాద్ మున్సిపల్ మేయర్ నీతూ కిరణ్ కొడుకు కృష్ణ చైతన్యతో గురువారం కామారెడ్డిలో జరిగింది. వివాహ వేడుకకు ఎమ్మెల్సీ కవిత, మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఎమ్మెల్యేలు గణేష్ గుప్తా, నాయకులు ఆకుల లలిత, ముజీబొద్దీన్ తదితరులు హాజరయ్యారు.

ఎడపల్లిలో వృద్ధురాలి అదృశ్యం



సాయవ్వ (ఫైల్)

ఎడపల్లి(బోధన్): మండల కేంద్రానికి చెందిన పల్లికొండ సాయవ్వ అనే వృద్ధురాలు అదృశ్యమైనట్లు ఎస్సై విక్రం గురువారం తెలిపారు. బుధవారం రాత్రి ఇంట్లో నిద్రించిన సాయవ్వ గురువారం ఇంట్లో కనిపించకపోడంతో కుమారుడు శంకర్ ఫిర్యాదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

క్రైం కార్నర్

పరిస్థితి విషమించి ఒకరి మృతి



రాజు మృతదేహం

తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి మండలంలోని ఎర్రాపహాడ్ గ్రామానికి చెందిన కుమ్మరి రాజు(32) చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో గురువారం మృతి చెందినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. తాడ్వాయిలో కూలి పనికి వెళ్లిన రాజు గడ్డి, దోమల మందును మాస్కు లేకుండా స్ప్రే చేయడంతో అస్వస్థతకు గురైనట్లు చెప్పారు. చికిత్స నిమిత్తం నిజామాబాద్‌కు తరలించగా వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం నిమ్స్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య మౌనిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చేపల వేటకు వెళ్లి ఒకరు..

బీబీపేట: చేపలు పట్టడానికి చెక్‌డ్యాంలోకి వెళ్లిన వ్యక్తికి వల చుట్టుకొని మృత్యువాత పడ్డ సంఘటన గురువారం మండలంలోని శేరిబీబీపేట గ్రామంలో చేపలు పట్టేందుకు వెళ్లిన మల్లయ్య(60) వల చుట్టుకొని మృతి చెందినట్లు ఎస్సై సాయిరెడ్డి గురువారం తెలిపారు. గ్రామానికి చెందిన పూస మల్లయ్య కూడవెళ్లి వాగులోని చెక్‌డ్యాంలో చేపలు పట్టేందుకు వెళ్లగా కాళ్లకు వల చుట్టుకుందన్నారు. దీంతో డ్యాంలో మునిగి మృతి చెందాడు. భార్య ఎల్లవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మల్లారం అటవీ ప్రాంతంలో మరొకరు..

ఖలీల్‌వాడి: చేపల వేటకు వెళ్లి ఒకరు మృతి చెందిన ఘటన మల్లారం అటవీ ప్రాంతంలో గురువారం చోటు చేసుకుంది. నగరంలోని ఇంద్రపూర్ కాలనీలోని సంతోష్‌నగర్‌కు చెందిన ఆగ్గు రవి(35) చేపల వేటకు మల్లారం చెరువుకు వెళ్లాడు. చేపలు పడుతున్న సమయంలో కాళ్లకు వల చుట్టుకోవడంతో చెరువులో మునిగి మృతి చెందాడు. గమనించిన స్థానికులు 101కు కాల్ చేయడంతో నిజామాబాద్ ఫైర్ రెస్క్యూటీం ఇన్‌చార్జి, ఫైర్ ఆఫీసర్ నర్సింగ్ రావు ఆధ్వర్యంలో సిబ్బంది మృతదేహాన్ని వెలికితీశారు. ఆపరేటర్ లక్ష్మీనర్సయ్య, ఫైర్‌మన్లు అనిల్, జైపాల్, సాయిలు ఉన్నారు.

విద్యుదాఘాతంతో గిరిజాతి ఆవు మృతి



రాజంపేట: విద్యుదాఘాతంతో గిరిజాతి ఆవు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కాసం రాము తన పంటపొలం వద్ద పశువుల పాకలో గేదెలతో పాటు గిరిజాతి ఆవును పెంచుతున్నాడు. ఉదయం కురిసిన వర్షానికి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభం కరెంటు తీగ తెగి పడి ఆవుపై పడడంతో మృతి చెందింది. దీని విలువ సుమారు రూ. 40 వేలు ఉంటుందని ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు

ఖలీల్‌వాడి: నగరంలోని నాగారంలో చైతన్యస్కూల్ విద్యార్థి హయతి(6)ని బుధవారం సాయంత్రం ఢీకొన్న విశ్వశాంతి స్కూల్ బస్సు డ్రైవర్ మహేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అప్పారావు గురువారం తెలిపారు. సీసీటీవీలో నేరం రుజువు కావడంతో బస్సు సీజ్ చేసి డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

సైబర్ క్రైమ్ పోలీసులతో రక్షణ

భిక్కనూరు: గుర్తుతెలియని లింక్‌ను ఓపెన్ చేసి డబ్బులు పంపి మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులకు సమాచారం అందించి తన నగదును కాపాడుకోగలిగాడు. వివరాలు ఇలా ఉన్నాయి. ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కంచర్ల గ్రామానికి చెందిన గొల్ల నవీన్ ఈనెల 5న తన వాట్సాప్‌లో వచ్చిన లింక్‌ను ఓపెన్ చేయగా రూ. 28,300 నగదు డిపాజిట్ చేసి మోసపోయినట్లు గుర్తించాడు. వెంటనే 1930 నంబర్‌కు ఫోన్ చేసి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వెంటనే వారు స్పందించి చర్యలు తీసుకోవడంతో యూపీఐ నంబర్ ఉన్న ఖాతాను హోల్డ్ చేయించారు. దీంతో ఆ డబ్బులు మోసగాళ్లకు చేరలేదు. ఎస్సై మాట్లాడుతూ.. నవీన్ తన చాకచక్యంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో మోసానికి సైబర్ నేరగాళ్ల మోసానికి గురికాలేదన్నారు. నవీన్ డబ్బులు త్వరలో ఆయన ఖాతాలో జమ అవుతాయని పేర్కొన్నారు.

ఉద్యోగుల సంక్షేమానికి బీఆర్ఎస్ కృషి

- ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్



జీపీ కార్యదర్శులకు రెగ్యులరైజేషన్ పత్రాలను అందజేస్తున్న ప్రభుత్వ విప్

కామారెడ్డి టౌన్: రాష్ట్రంలో ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తున్న ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కామారెడ్డి, మాచారెడ్డి, భిక్కనూర్ మండలాలకు చెందిన 8 మంది జూనియర్ గ్రామ పంచాయతీ కార్యదర్శులకు రెగ్యులరైజేషన్ ధ్రువపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కమిటీ సమక్షంలో గ్రామాల అభివృద్ధికి కృషి చేసిన కార్యదర్శులను రెగ్యులరైజ్ చేశామన్నారు. ఇప్పటి నుంచి పంచాయతీ కార్యదర్శులు రెట్టింపు ఉత్సాహంతో గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబొద్దిన్, ఎంపీపీలు పిప్పిరి ఆంజనేయులు, లోయపల్లి నర్సింగ్‌రావు, జూకంటి ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే రూ.2 లక్షల రుణమాఫీ

- పీసీసీ కార్యదర్శి సుభాష్ రెడ్డి



ర్యాలీ నిర్వహిస్తున్న పీసీసీ కార్యదర్శి సుభాష్‌రెడ్డి

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతులకు ఒకేసారి రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని పీసీసీ కార్యదర్శి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి అన్నారు. పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర ఏడాది పూర్తయిన సందర్భంగా గురువారం ఎల్లారెడ్డిలో సుభాష్‌రెడ్డి కార్యకర్తలతో కలిసి కాగడాలతో ర్యాలీ నిర్వహించారు. గాంధీచౌక్‌లో గాంధీ విగ్రహానికి పూల మాల వేసిన అనంతరం పార్టీ కార్యాలయం వరకు కాగడాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పార్టీ అధికారంలోకి రాగానే రూ.500లకే గ్యాస్ సిలిండర్, వృద్ధులకు రూ.4 వేల పెన్షన్ ఇస్తుందన్నారు. వైస్ ఎంపీపీ నర్సింలు, నాయకులు జనార్దన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అఫీజ్, పరంధాములు తదితరులున్నారు.

రాష్ట్రంలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే



ఎల్లారెడ్డిలో ర్యాలీ నిర్వహిస్తున్న మదన్‌మోహన్

ఎల్లారెడ్డి: రాష్ట్రంలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని పీసీసీ ఉపాధ్యక్షుడు మదన్‌మోహన్ రావు అన్నారు. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర ప్రారంభించి ఏడాది పూర్తయిన సందర్భంగా గురువారం ఎల్లారెడ్డి పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి గాంధీచౌక్ వరకు కార్యకర్తలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. బీఆర్ఎస్ పాలన పట్ల ప్రజలు విసుగు చెందారని, కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టే సమయం ఆసన్నమైందని అన్నారు. నాయకులు లక్ష్మణ్, ఆరిఫ్, అజర్, ఫతియోద్దిన్ తదితరులున్నారు.

బాలిక విక్రయంపై అధికారుల విచారణ

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని గోపాల్‌పేటకు చెందిన ఓ మహిళ తన పెద్ద కుమార్తెను విక్రయించిందనే ఆరోపణతోపాటు చిన్న కుమార్తెను అక్రమంగా దత్తత ఇచ్చిన విషయమై జిల్లా బాలల సంరక్షణ అధికారులు గురువారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు సదరు మహిళ ఇంటికి వెళ్లి పూర్తి వివరాలను సేకరించారు. ఏడేళ్ల వయసు ఉన్న పెద్ద కుమార్తెను గతనెల 17న కొందరి మధ్యవర్తిత్వంతో బాలిక తల్లి రూ.30వేలకు లింగంపేట మండలం పోల్కంపేటకు చెందిన హుస్సేన్, సిద్దవ్వకు విక్రయించినట్లు గుర్తించారు. దీంతోపాటు రెండేళ్ల వయసున్న చిన్న కుమార్తెను పుట్టిన 15 రోజులకే సమీప బంధువైన తాండూరు గ్రామంలోని భోగం కృష్ణకు దత్తత ఇచ్చినట్లు విచారణలో తేలింది. ఈ మేరకు జిల్లా బాలల సంరక్షణ కార్యాలయ సిబ్బంది గజ్జల స్వామి నాగిరెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాలిక విక్రయంతోపాటు అక్రమ దత్తతకు కారణమైన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకొవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై రాజు తెలిపారు.

వర్షానికి కూలిన ఇల్లు



రుద్రూర్:మండల కేంద్రంలో బుధవారం కురిసిన వర్షానికి నాగభూషణానికి చెందిన ఇల్లు కూలి పోయింది. మురికి కాల్వ వైపు గోడ పడడంతో ప్రాణాలతో బయట పడినట్లు బాధితుడు తెలిపాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

భార్యపై అనుమానంతో బలవన్మరణం

- పురుగుల మందుతాగి భర్త ఆత్మహత్య
- 40 రోజుల తర్వాత మృతదేహం లభ్యం



బాలనర్సయ్య(ఫైల్)

నవీపేట: మండలంలోని అబ్బాపూర్(ఎం) గ్రామానికి చెందిన బాలనర్సయ్య(32) జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు. 40 రోజుల కిందట ఆత్మహత్యకు పాల్పడగా గురువారం మృతదేహం లభ్యమైంది. నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ సతీశ్, ఎస్సై యాదగిరిగౌడ్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బాలనర్సయ్య భార్య కవిత అదే గ్రామానికి చెందిన అరుణ్‌తో వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఈ విషయమై పలుమార్లు భార్య, భర్తల మధ్య గొడవలు జరిగాయి. దీంతో జీవితంపై విరక్తి చెందిన బాల నర్సయ్య జులై 28న ఇంట్లో నుంచి బయటకు వెళ్లి గ్రామ శివారులోని గుట్టప్రాంతంలోకి వెళ్లి పురుగుల మందు సేవించి మృతి చెందాడు. గురువారం ఆ ప్రాంతానికి వెళ్లిన పశువుల కాపరి కుళ్లిన మృతదేహాన్ని చూసి గ్రామస్తులకు సమాచారమిచ్చాడు. బాల నర్సయ్యగా గుర్తించిన మృతుని తండ్రి వెంకటి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మృతుని భార్య కవితతో పాటు ఆమె ప్రియుడు అరుణ్ వ్యవహారంతోనే తన కుమారుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఫిర్యాదు చేయడంతో ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఉద్యోగం రాలేదని యువకుడి ఆత్మహత్య



అఖిల్ (ఫైల్)

ఖలీల్‌వాడి: నగరంలోని నాందేవ్‌వాడకు చెందిన అఖిల్(27) ఉద్యోగం రాలేదనే బాధతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ గురువారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఉద్యోగం రాలేదనే బాధతో అఖిల్ మద్యానికి బానిసైనట్లు తెలిపారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా అతని భార్య తేజస్విని కుతూరు ఆద్యతో కలిసి పుట్టింటికి వెళ్లింది. బుధవారం రాత్రి తన గదిలో పడుకున్న అఖిల్ ఉదయం డోర్ తీయకపోవడంతో గమనించిన కుటుంబీకులు కిటికిలోంచి చూడగా ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడి తండ్రి సంతోష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బహ్రెయిన్‌లో ఒకరు..



స్వామి(ఫైల్)

రామారెడ్డి (ఎల్లారెడ్డి): ఉపాధి నిమిత్తం బహ్రెయిన్‌కు వెళ్లిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని గిద్ద గ్రామానికి చెందిన పల్లెల స్వామి (25) రెండు నెలల క్రితం బహ్రెయిన్‌కు వెళ్లాడు. అక్కడ ఈ నెల 2న తన గదిలో ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం అందినట్లు తల్లిదండ్రులు కలవ్వ ధర్మయ్య తెలిపారు. కానీ తమ కుమారుడు ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదని అక్కడ ఏదో జరిగిందని ప్రజాప్రతినిధులు స్పందించి తమ కుమారుడి మృతికి న్యాయం చేయాలని వారు కోరుతున్నారు. స్వామి మృతదేహాన్ని స్వదేశానికి తెప్పించాలని కుటుంబీకులు కోరారు.

పెళ్లి రోజే వరుడి మృతదేహం లభ్యం

- అడ్లూర్ ఎల్లారెడ్డిలో విషాదం



రాజేందర్‌రెడ్డి(ఫైల్)

లింగంపేట(ఎల్లారెడ్డి): పెళ్లి రోజే వరుడి మృతదేహం లభ్యమైన ఘటన సదాశివనగర్ మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డిలో గురువారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మొసర్ల చిన్న నర్సింహులుకు ఇద్దరు కుమారులు. చిన్నకుమారుడైన రాజేందర్‌రెడ్డి(29) వివాహం రాంపూర్‌కు చెందిన అమ్మాయితో గురువారం జరగాల్సి ఉంది. రాజేందర్‌రెడ్డి అన్న శ్యామ్‌రెడ్డి ఇద్దరు కలిసి పెళ్లి పత్రికలను ఇటీవల బంధువులకు పంచారు. ఈ నెల 3న ఇంటి నుంచి వెళ్లిన రాజేందర్‌రెడ్డి ఇంటికి తిరిగి రాలేదు. చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. స్థానికుల సమాచారం మేరకు లింగంపేట మండలం ఎల్లారం అటవీ ప్రాంతంలో చెట్టుకు ఉరేసుకొని రాజేందర్‌రెడ్డి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై తెలిపారు. లింగంపేట ఏఎస్సై ప్రకాశ్ కేసు నమోదు చేసి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.